- నకిలీ పట్టాలతో కాజేసిన వైనం
- వైసీపీ నాయకుల మాయాజాలం
- 1985లోనే రిజిస్ట్రేషన్ చేశారట..
- అది కూడా అనంత రిజిస్ట్రార్ కార్యాలయంలో..
- గత నెలలో భూమి మార్పునకు జేసీ ఉత్తర్వులు
- మాజీ ప్రజాప్రతినిధి కనుసన్నల్లో తంతు
- అడ్డంగా రాసిచ్చేసిన అధికారులు
- కూటమి అధికారం చేపట్టినా ఆగని వైసీపీ దందా



మఠం భూమిలో వెలసిన గుడారాలు

వెలసిన గుడారాలు

వివాదాస్పదంగా మారిన నిడిమామిడి జంగం మఠం భూమిలో తాజాగా పేదలు గుడిసెలు వేశారు. ఆ భూములు మఠానికైనా దక్కాలి, పేదల వశమైనా కావాలని సీపీఐ ఆధ్వర్యంలో వందలాది మంది పేదలు మఠం భూమిలో గుడిసెలు ఏర్పాటుచేశారు. భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు అడ్డుచెప్పకపోవడం గమనార్హం.

మఠం భూమి టాష్!

రూ.100 కోట్ల కబ్జా..!

వైసీపీ నాయకులు ఏకంగా రూ.100 కోట్ల భూమిపై కన్నేశారు. మఠం భూమి కావడంతో అడిగేవారుండరనుకున్నారు. గత నెల వరకు అధికారం చేతిలో ఉండడంతో అడ్డంగా పావులు కదిపారు. మాజీ ప్రజాప్రతినిధి డైరెక్షన్‌లో తంతు నడిపినట్లు తెలుస్తోంది. 1985లోనే కొనుగోలు చేసినట్లు నకిలీ పత్రాలు సృష్టించారు. అది కూడా భూమి బత్తలపల్లి వద్ద ఉంటే.. అనంతపురం రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ తర్వాత భూమిని పిల్లల పేరున బదలాయించారు. దాదాపు 40 ఏళ్లలో ఏనాడూ భూమి తమ దంటూ రాలేదు. గత నెలలో వైసీపీ దారుణంగా ఓడిపోయింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అయినా.. వైసీపీ దందా నడిపించారు. గతనెల 28న ఆ భూమిని దేవదాయ పరిధి నుంచి బదలాయించాలని ఏకంగా జేసీ ఉత్తర్వులు వెలువడ్డాయి. అదీ రహస్యంగా. అత్యంత గోప్యంగా. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర స్థాయిలో కీలకమైన అధికారి ద్వారా ఈ అక్రమ తంతు నడిపారంటే ఏస్థాయిలో మేనేజ్ చేశారో అర్థం చేసుకోవచ్చు.

బత్తలపల్లి, జూలై 12: వైసీపీ నాయకులు ఏకంగా రూ.100 కోట్ల విలువైన భూమిపై కన్నేశారు. అడ్డదారుల్లో పావులు కదిపి.. నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకుని, కైవసం చేసుకోవాలనుకున్నారు. వారి దోపిడీకి అధికారులు ఎంచక్కా సహకరించారు. ప్రభుత్వం మారినా అధికారులు ఇంకా మారకపోవడంతో ఇప్పుడు కూడా కొన్ని పనులు వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే సాగుతున్నాయనడానికి మండల కేంద్రం సమీపంలోని నిడిమామిడి జంగం మఠం భూమి వ్యవహారమే నిదర్శనం. మఠం భూమిపై కొన్నేళ్లుగా వివాదం నెలకొంది. ఉన్నతాధికారులు మాత్రం వైసీపీ నాయకులకే ఆ భూమిని కట్టబెట్టడం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బత్తలపల్లి పరిధి 401 సర్వే నంబరులోని దాదాపు రూ.100కోట్ల విలువైన 19.84 ఎకరాల భూమిని ఏకంగా వైసీపీ నాయకుల పేరిట రికార్డుల్లో మార్చడం స్థానికులను నివ్వెరపోయేలా చేసింది. ఇంత విలువైన భూమి వైసీపీ నాయకుల చేతుల్లోకి వెళ్లడం వెనుక భారీఎత్తున డబ్బు చేతులు మారినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అధికారులు, నాయకులు కుమ్మక్కవడం వల్లే మఠం భూమి కబ్జా చేశారని స్థానికంగా చర్చోపచర్చలు సాగుతున్నాయి.

బత్తలపల్లిలోని ధర్మవరం రహదారి పక్కనే 401 సర్వే నంబరులో కర్ణాటకలోని నిడిమామిడి జంగం మఠానికి 19.84 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి విలువ ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ఎకరా రూ.5కోట్లకుపైగానే పలుకుతోంది. దీనిని 1970 నుంచి బత్తలపల్లికి చెందిన కోటి రాముడు కౌలుకు తీసుకుని, పంటలు సాగు చేస్తుండేవాడు. కోటి రాముడు తరువాత అతడి కుటుంబమే ఆ భూమిని సాగు చేసుకుంటూ వస్తోంది. ఇప్పటి వరకు వారే సాగులో ఉన్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చే నాటికి ఆ భూమి విలువ భారీగా పెరిగింది. ఆ నోటా.. ఈనోటా విషయం అప్పటి ప్రజాప్రతినిధి వద్దకు చేరింది. దీంతో ఆ భూమిపై ఆయన కన్ను పడినట్లు తెలుస్తోంది. అంతలోనే ఆ మఠం భూమి తమ పేరున రిజిస్ట్రేషన్ అయినట్లు కొందరు తెరపైకి తెచ్చారు. 1985లో ఈ మఠం భూమికి సంబంధించి అనంతపురం రిజిస్ట్రార్ కార్యాలయంలో మాచిరెడ్డిగారి నారపరెడ్డి, పూల రామన్న పేర్లతో రిజిస్ట్రేషన్ అయినట్లు పత్రాలు వెలుగులోకి వచ్చాయి. అప్పట్లో ఏ ప్రాంతానికి చెందిన భూములు సంబంధిత రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలోనే

కాజేశారిలా..

రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్న నిబంధన ఉండేది. మరో ప్రాంతంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే రిజిస్ట్రార్ అందుకు సమ్మతించే వారు కాదు. 2019లో వైసీపీ అధికారం చేపట్టాక ఆ పార్టీ నాయకులు చక్రం తిప్పారు. 2021లో బత్తలపల్లి మండలం అప్రాచెరువు గ్రామానికి చెందిన మాచిరెడ్డిగారి నారపరెడ్డి వారసులు రాష్ట్రస్థాయిలో పలుకుబడిని ఉపయోగించి, ఏకంగా చీఫ్ సెక్రటరీ ద్వారానే అనుమతులు తీసుకొచ్చినట్లు సమాచారం. దీనివెనుక అప్పటి ప్రజాప్రతినిధి కీలకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది. సాగులో ఉన్న కోటి కుటుంబానికి కూడా విషయం తెలీదు. అంత గోప్యత పాటించారు. పూల రామన్న కుటుంబీకుల పేరు మీద కూడా భూమి రిజిస్ట్రేషన్ చేసినట్లు రికార్డుల్లో పేర్కొన్నారు. అప్రాచెరువు గ్రామానికి చెందిన వారు ప్రస్తుతం స్థానికంగా ఉండట్లేదు. వేరే ప్రాంతంలో ఉంటున్నట్లు సమాచారం.

అధికారం మారినా.. వైసీపీకి అనుకూలంగా..

నిడిమామిడి జంగం మఠం భూమి వ్యవహారం తీవ్ర వివాదాస్పదమైంది. ఇంత జరుగుతున్నా.. అధికారులు మాత్రం ఇప్పటికి వైసీపీ కనుసన్నల్లోనే పనిచేస్తున్నారన్న దానికి ఏకైక నిదర్శనం మఠం భూమే. భూమి వెనుక ఎటువంటి తతంగాలు ఉన్నాయి? అసలు నిజంగానే రిజిస్ట్రేషన్ జరిగిందా అనేది కూడా అధికారులు పట్టించుకోలేదు. వైసీపీ నాయకులకు అనుకూలంగా పచ్చజెండా ఊపుతూనే ఉన్నారు. గత వైసీపీ పాలనలో ప్రజాప్రతినిధి ప్రధాన అనుచరుడైన మాచిరెడ్డిగారి నారపరెడ్డి కుటుంబీకుల పేరున మఠం భూమిని రికార్డుల్లోకి ఎక్కించాలని ఈ ఏడాది జూన్ 28న ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలా ఉత్తర్వులు వచ్చాయో.. లేదో.. ఆగమేఘాల మీద రికార్డుల్లోకి ఎక్కించి స్వామిభక్తిని చాటుకున్నారు అధికారులు. ఈ తతంగం అత్యంత గోప్యంగా, శరవేగంగా సాగడం వెనుక రూ.కోట్లలో చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ ప్రజలకు చిన్నపని చేసి పెట్టాలన్నా.. చుక్కలు చూపించే అధికారులు.. ఇంత వివాదాస్పదమైన వ్యవహారాన్ని మాత్రం చకచకా నడిపించడం విమర్శలకు తావిస్తోంది. వెనకాముందు ఆలోచన చేయకుండా పనులు చేసిపెట్టడం పట్ల స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ తతంగం వెనుక మాజీ ప్రజాప్రతినిధి అనుచరుడైన ఓ రియల్టర్, గతంలో పనిచేసిన ఇద్దరు మండలస్థాయి అధికారులు కీలకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది.

పంచేసుకున్నారు..

జంగం మఠానికి చెందిన 19.84 ఎకరాల భూమిని నారపరెడ్డి, పూల రామన్న కుటుంబీకుల పేర్లతో 1బీ అడంగళ్‌లో ఎక్కించారు. నారపరెడ్డి కుమారులు మాచిరెడ్డిగారి లక్ష్మీనరసింహారెడ్డి పేరు మీద 4.96, మాచిరెడ్డిగారి ఈశ్వర్‌రెడ్డి పేరు మీద 4.96, పూల రామన్న కుటుంబీకులైన పూల క్రిష్ణవేణి పేరున 3.31, పి.రామ్‌మోహన్ పేరున 3.31, పూల లక్ష్మీనరసయ్య పేరున 3.30 ఎకరాల చొప్పున 1బీ అడంగళ్‌లో నమోదు చేశారు.



గత నెలలో పట్టా భూమిగా మార్చాం

మఠం భూమి గతనెల 28వ తేదీ వరకు దేవదాయ భూమిగానే రికార్డుల్లో ఉంది. కొన్నవారు దరఖాస్తు చేసుకోవడంతో పట్టా భూమిగా మార్చాం.

- శివశంకర్‌నాయక్, తహసీల్దార్, బత్తలపల్లి



వెంకట తిమ్మాపురం చెరువుకట్ట సమీపాన నాటుసారా తయారు చేసి, బిందెల్లో ఉంచిన దృశ్యం (ఫైల్)



గ్రామాల్లో నాటుసారాకి అడ్డుకట్ట పడట్లేదు. విచ్చలవిడిగా తయారుచేసి, విక్రయిస్తున్నా కట్టడి చేయాల్సిన సెబ్, పోలీసులు మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాటుసారా తాగుతున్న ప్రజలు అనారోగ్యం బారినపడి ఆస్పత్రుల పాలవుతున్నారు. గత వైసీపీ హయాంలో మద్యం ధరలు విపరీతంగా పెంచేశారు. అంత ధర పెట్టి కొనుగోలు చేయలేక తక్కువ ధరకే వస్తున్న నాటుసారాకు మద్యంబాబులు మొగ్గుచూపారు. దీంతో సారా తయారీదారులు జోరు పెంచారు. అప్పట్లో వైసీపీ నాయకులు సారా తయారీని ప్రోత్సహించి, జేబులు నింపుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. పలువురు పోలీసులకు మామూళ్లు ముట్టజెబుతూ యథేచ్ఛగా నాటుసారా తయారు చేయించారన్న విమర్శలున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరినా నాటుసారాకు అడ్డుకట్ట పడట్లేదు. జోరుగా తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది.

- ధర్మవరం రూరల్



సారాకి అడ్డుకట్ట ఏదీ?

- వైసీపీ హయాంలో గ్రామాల్లో జోరుగా తయారీ
- నేటికీ కొనసాగిస్తున్న వైనం
- మామూళ్ల మత్తులో సెబ్, పోలీసులు
- యథేచ్ఛగా విక్రయాలు



ఎక్కడెక్కడ తయారు చేస్తున్నారంటే..

నాటుసారా తయారీనీ ధర్మవరం మండలంలోని వెంకటతిమ్మాపురం గ్రామ శివారులో చెరువుకట్టకింద ఓ తోట సమీపంలో అధికంగా తయారు చేస్తున్నట్లు గ్రామస్థుల ద్వారా తెలుస్తోంది.

గతంలో కూడా ఇదే ఊరిలో నాటుసారా ప్యాకెట్లు భారీగా లభ్యమయ్యాయి. ఓబుళనాయునపల్లి, తండా, నడిమిగడ్డపల్లి తండా సమీప కొండల్లో, నేలకోటతండా, ముదిగుబ్బ మండలంలో అడవిబ్రాహ్మణపల్లి తండా, గరుగుతండా, గుడ్డంపల్లి తండా తదితర గ్రామాల్లో జోరుగా నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారం. ఇతర ప్రాంతాలకు సైతం రవాణా చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల సెబ్ అధికారుల దాడుల్లో కూడా పైగ్రామాల్లో నాటుసారా బిందెలను పగులగొట్టినట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. నాటుసారాకు అలవాటుపడిన ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. గ్రామాల్లో మహిళలు.. నాటుసారా తయారీదారులను బహిరంగంగానే తిడుతున్నారు.

మామూళ్ల మత్తులో సెబ్, పోలీసులు...?

పలువురు సెబ్, పోలీసులు మామూళ్లు తీసుకుంటూ నాటుసారాకి అడ్డుకట్ట వేయట్లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది కిందిస్థాయి సిబ్బంది.. తయారీదారులతో కుమ్మక్కవడంతో విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నట్లు తెలుస్తోంది. నాటుసారాను పట్టుకోవడానికి మండలస్థాయి అధికారులు ఆయా గ్రామాలకు వెళితే.. వెంటనే తయారీదారులకు కొంతమంది కిందిస్థాయి సిబ్బంది సమాచారం చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో తయారీదారులు అప్రమత్తమవుతున్నట్లు చర్చ సాగుతోంది. ఇలా.. నాటుసారాను కట్టడి చేయడంలో విఫలమవుతున్నారని ఆ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి, నాటుసారాను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కేసులు నమోదు చేస్తాం

గ్రామాల్లో నాటుసారా తయారు చేసినా, విక్రయించినా ఉపేక్షించేది లేదు. తయారీదారులు ఎంతటివారైనా కేసులు నమోదు చేస్తాం. దాడులు పెంచుతాం.

- గురుప్రసాద్, సెబ్ సీఐ, ధర్మవరం

ప్రశాంత జీవనం దిశగా అడుగులేయాలి

సత్యసాయి సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే

సత్యసాయి యూత్ గ్లోబల్ సదస్సు ప్రారంభం

సమసమాజ స్థాపనలో యువతే కీలకం

పుట్టపర్తి, జూలై 12: సమసమాజ స్థాపనలో యువత కీలకం కావాల్సి ఉందని సత్యసాయి సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే వక్కాణించారు. ఆధునిక ప్రపంచంలో మానవజీవితం నిరంతరం పరుగుల మయంగా మారి ఒత్తిడికి లోనవుతున్నారని ప్రశాంత జీవనం దిశగా యువత కృషి చేయాలన్నారు. స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ సభామండపం, ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సెంటర్‌లో శ్రీసత్యసాయి యూత్ గ్లోబల్ యంగ్ అడల్ట్ కౌన్సిల్ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. మొదట సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ జ్యోతిప్రజ్వలన చేసి, సదస్సును ప్రారంభించారు. 24 దేశాలకు చెందిన వారు తమ జాతీయ జెండాలతో ర్యాలీగా సాయికుల్వంత్‌కు చేరుకున్నారు. యువత వేదపఠనంతో సదస్సు ప్రారంభమైంది. సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కులం, అత్యాస, మతం వంటి వాటితో వెలితే మానవత్వం మనుగడ సాగదన్నారు. మానవతా విలువలులేని సమాజంలో అశాంతి నెలకొంటుందన్నారు. నిస్వార్థంతో చేసే ఏకార్యక్రమమైనా సత్ఫలితాలిస్తుందన్నారు. సత్యసాయి బోధించిన సత్యం, శాంతి, ప్రేమ, ధర్మం, అహింస పంచసూత్రాలు జీవిత పరమావధిగా ప్రతిఒక్కరూ పాటించినపుడు జీవితం సుఖమయంగా సాగుతుందన్నారు. సత్యసాయి సేవాసంస్థలు మానవతా విలువలతో, సామాజిక స్పృహతో మానవాళికి సేవలు అందిస్తున్నాయన్నారు. ప్రశాంతినిలయం ప్రపంచ శాంతికి వేదికగా నిలిచిందన్నారు. విద్యతోపాటు విలువలతో కూడిన జీవితం సాగించాలన్నారు. అనంతరం ట్రస్టు సభ్యుడు నాగానందం మాట్లాడుతూ.. సత్యసాయి ప్రేమతత్వం, ఆధ్యాత్మికతను విశ్వవ్యాప్తం చేయాల్సిన బాధ్యత యువతపైనే ఉందన్నారు. సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో రామాయణ, మహాభారతంలోని ఘట్టాలను విద్యార్థులు ప్రదర్శించారు. మరో రెండు రోజులపాటు సదస్సు కొనసాగనుంది. సదస్సులో 2500 మంది పాల్గొన్నారు. అనంతరం భక్తులు.. సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



జ్యోతిని వెలిగిస్తున్న ఆర్జే రత్నాకర్





ఆయాదేశాల జెండాలతో వస్తున్న యువత, రామాయణ ఘట్టంలోని ఓ సన్నివేశం (ఇన్‌సెట్‌లో..)



అవార్డు అందుకుంటున్న నాగేంద్రమ్మ

బత్తలపల్లి మహిళా రైతుకు అంతర్జాతీయ

అవార్డు

బత్తలపల్లి, జూలై 12: మండల కేంద్రానికి చెందిన మహిళా రైతు నాగేంద్రమ్మ అంతర్జాతీయ స్థాయిలో అవార్డు అందుకున్నారు. ప్రకృతి వ్యవసాయం అభివృద్ధికి ఆమె చేసిన కృషికి గుర్తింపు లభించింది. ఏపీ సమాఖ్య ప్రకృతి వ్యవసాయానికి ప్రతిష్టాత్మక గుల్బెంకియన్ అవార్డు లభించింది. పోర్చుగల్‌లోని లిస్‌బిన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ కుమార్‌తో కలిసి నాగేంద్రమ్మ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డు కోసం 117 దేశాల నుంచి 181 నామినేషన్లు వచ్చాయి. వాటిలో మూడింటిని ఎంపిక చేయగా.. అందులో ఏపీ సమాఖ్య ఉండడం హర్షణీయం. పర్యావరణ మార్పులు, జీవవైవిధ్య నష్టాలు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలకు ఏటా ఈ అవార్డులు అందజేస్తారని మహిళా రైతు ఫోన్ ద్వారా తెలిపారు. కాగా, రైతు నాగేంద్రమ్మ ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడంతో పాటు పలువురికి అవగాహన కల్పిస్తూ.. వారు కూడా పంటలు సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నారు.

రీచ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

జేసీ ఆదేశం

ముదిగుబ్బ/తాడిమర్రి, జూలై 12: ముదిగుబ్బ మండలంలోని ఉప్పలపాడు గ్రామ సమీపాన గల ఇసుక రీచ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) అభిషేక్ కుమార్ ఆదేశించారు. స్టాక్ పాయింట్‌ను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఇసుక డి-సిల్టేషన్ పాయింట్‌ను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి, ఇసుక రవాణాపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రీచ్‌లో సీసీ కెమెరా ఏర్పాటు చేయాలని, దారిలో దుమ్ము రాకుండా నీటితో తడపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని పలు కార్యాలయాలను తనిఖీ చేశారు. తాడిమర్రి మండలంలోని నీసీ రేవు డీ షెల్టర్ (ఇసుక రీచ్) వద్ద భద్రత ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ అహిషేక్ కుమార్ అన్నారు. రెండేళ్ల క్రితమే ఇసుక రీచ్‌ను మూసివేసిన నేపథ్యంలో తవ్వకాలు చేపట్టకుండా చూడాలని ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో గనులశాఖ ఏడీ రామ్మోహన్, పొల్యూషన్ ఈఈ కిషోర్, ఇరిగేషన్ ఈఈ రాజశేఖర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.



ఉప్పలపాడు ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న జేసీ

రైల్వే ఉద్యోగులపై కక్ష సాధింపులు మానుకోవాలి

మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్



మాట్లాడుతున్న విజయకుమార్

గుంతకల్లు, జూలై 12: రైల్వే ఉద్యోగులపై యాజమాన్యం కక్షసాధింపు చర్యలను మానాలని మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని డీఆర్ఎం కార్యాలయం వద్ద మజ్దూర్ యూనియన్ రైల్వే ఉద్యోగుల సమస్యలపై ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా రైల్వే ఉద్యోగులు, కార్మికులు పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలంటూ నినాదాలు చేశారు. డివిజనల్ కార్యదర్శి మాట్లాడుతూ రైల్వే కార్మికులకు, ఉద్యోగులకు ఏమాత్రం ఆమోద యోగ్యం కాని నూతన పింఛను విధానాన్ని బలవంతంగా రుద్దారన్నారు. 8వ పే రివిజన్ కమిషన్‌ను ఏర్పాటుచేయాలని, పాయింట్స్‌మెన్‌కు 4 గ్రేడ్స్ ఇవ్వాలని, పాయింట్స్‌మెన్‌తోపాటు ట్రాక్‌మెన్‌కు రూ. 4,200ల గ్రేడ్‌పే ఇవ్వాలని, ట్రైన్ పాసింగ్ డ్యూటీలు చేసేవారికి రిస్క్ అలవెన్సు, హార్డ్ డ్యూటీ అలవెన్సులను ఇవ్వాలని, ట్రాక్‌మెన్‌కు సైకిల్ అలవెన్సును ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఏదైనా ప్రశ్నకు సమాధానమిస్తే ఎదురు మాట్లాడుతున్నారంటూ రైల్వే ఉద్యోగులపై ఉన్నతాధికారులు కక్షగడుతున్నారని వెంటనే వేధింపులను మానాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఏడీఎస్‌లు మధుసూదనరావు, నారాయణ, శేఖర్‌బాబు, అశ్విని, కార్యదర్శులు ఎస్ఎం బాషా, రమేశ్, సుధాకర్, రాజశేఖర్, మనోహర్, రవీంద్రనాయక్, సురేష్ పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేద్దాం

జలవనరుల శాఖ ఇంజనీర్లకు సీఈ, ఎస్ఈ సూచన



సీఈని అభినందిస్తున్న హంద్రీనీవా ఎస్ఈ, ఇంజనీర్లు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 12: ఇంజనీర్లు, ఉద్యోగులందరూ కలసికట్టుగా పనిచేసి జిల్లాను సస్యశ్యామలం చేద్దామని జలవనరుల శాఖ సీఈ నాగరాజు, హంద్రీనీవా ఎస్ఈ దేసేనాయక్ పిలుపునిచ్చారు. జలవనరుల శాఖ సీఈగా బాధ్యతలు స్వీకరించిన నాగరాజును శుక్రవారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని ఆ శాఖ కార్యాలయంలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఎస్ఈ దేసేనాయక్ ఆధ్వర్యంలో ఇంజనీర్లు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్ట్ పనులను సకాలంలో పూర్తిచేసి జిల్లా ప్రజలకు సాగు, తాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇందుకు సమష్టి కృషి, ప్రణాళికతో ముందుకు వెళ్దామని అన్నారు. జిల్లాకు వీలైనంత ఎక్కువ నీటిని శ్రీశైలం డ్యాం నుంచి హంద్రీనీవా కాలవ ద్వారా తీసుకువచ్చేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. హంద్రీనీవా డిప్యూటీ ఎస్ఈ రాంభూపాల్‌రెడ్డి, ఏపీ ఇరిగేషన్ ఎన్జీఓ రాష్ట్ర కార్యదర్శి మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీటెక్ కన్వీనర్ కోటాలో 40,891 సీట్లు

జేఎన్‌టీయూ 40,399, ఎస్కేయూ 330, బెస్ట్‌కు 113తోపాటు సీఏఎంఎస్‌కు 29 కేటాయింపు..

ముగిసిన ఈఏపీసెట్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ

నేడు మార్పునకు అవకాశం

అనంతపురం సెంట్రల్, జూలై 12: ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు బీటెక్ ఇంజనీరింగ్ కోర్సుల్లో కన్వీనర్ కోటా కింద ప్రవేశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 40891 సీట్లను కేటాయించింది. వీటిలో జిల్లాలోని జేఎన్‌టీయూ 40399, ఎస్కేయూ 330, బెస్ట్ ప్రైవేట్ యూనివర్సిటీ 113, కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్(మడకశిర) 29 చొప్పున మొత్తం 40891 సీట్లున్నాయి. జేఎన్‌టీయూ పరిధిలో అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, నెల్లూరు ఉమ్మడి జిల్లాలవ్యాప్తంగా నాలుగు కానిస్టిట్యూయేట్, 67 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలున్నాయి. అదే విధంగా ఎస్కేయూ క్యాంపస్, బెస్ట్ యూనివర్సిటీ, ఆచార్య ఎన్‌జీ రంగ అగ్రికల్చర్ అనుబంధంగా కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కాలేజ్ మొత్తం 74 కళాశాలలున్నాయి. కన్వీనర్ కోటాలో సీటు పొందిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుంది. ఉద్యోగులు, రేషన్ కార్డులేని వారు సొంతంగా కట్టుకోవాల్సి ఉంటుంది. ఒక్కో సీటుకు జేఎన్‌టీయూ అనుబంధ ప్రైవేటు కళాశాలల్లో కనిష్ఠం రూ.40వేల నుంచి రూ.84వేల వరకు ప్రభుత్వ ఫీజులు నిర్ధారించింది. ఎస్కేయూ రూ.70వేలు, బెస్ట్ ప్రైవేటు యూనివర్సిటీకి రూ.69500 చొప్పున చెల్లించనుంది. అయితే జేఎన్‌టీయూ అనంతపురం, పులివెందుల, కలికిరి కళాశాలలు. మడకశిర అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రభుత్వానికి సంబంధించినవి కావడంతో రూ.10వేలుగా నిర్ధారించారు.

బీటెక్ ఇంజనీరింగ్‌లో కోర్సుల వారిగా కన్వీనర్ కోటా సీట్ల కేటాయింపు

కోర్సు	సీట్ల సంఖ్య
కంప్యూటర్ సైన్స్	13798
కంప్యూటర్ సైన్స్ అడ్వాన్స్	11443
మెకానికల్	2064
ఎలక్ట్రికల్	2949
ఎలక్ట్రానిక్స్	8493
సివిల్	2016
కమికల్	66
ఫుడ్ టెక్నాలజీ	33
అగ్రికల్చర్	29
మొత్తం	40891

కంప్యూటర్ సైన్స్‌కే అధిక కేటాయింపు

బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ప్రాధాన్యత సంతరించుకుంది. విద్యార్థుల తల్లిదండ్రులు అత్యధికంగా తమ పిల్లలను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను చేయాలన్న ఆకాంక్షతో ఈ కోర్సువైపే మొగ్గుచూపుతున్నారు. డిమాండ్ పెరగడంతో ఏఐసీటీఈ అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రవేశాలకు ఏకంగా 13798 సీట్లను కేటాయించింది. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ అడ్వాన్స్ కోర్సులుగా పిలువడే ఏఐ, ఏఐడి, ఏఐఎం, సీఏడీ, సీఏఐ, సీఎస్ఎం, డీఎస్, ఐఎన్‌ఎఫ్ తదితర వాటికి 11223 సీట్లను కేటాయించింది. కోర్ బ్రాంచ్‌లైన మెకానికల్, సివిల్, ఈఈఈకు పోటీలేకపోవడంతో తక్కువ సీట్లకే పరిమితం చేసింది.

ముగిసిన వెబ్ ఆప్షన్ల ప్రక్రియ

బీటెక్ ప్రవేశాలకు ఈఏపీసెట్ కౌన్సిలింగ్‌కు రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు వారికి నచ్చిన కళాశాల, బ్రాంచ్(కోర్సు)లను ఎంపిక వెబ్ ఆప్షన్ల ప్రక్రియ మంగళవారం ప్రారంభమై శుక్రవారంతో ముగిసింది. అయితే వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్న వారు శనివారం వాటిలో మార్పు, చేర్పులకు అవకాశమిచ్చింది. అయితే ఈ గడువు ముగుస్తుందా? ఇంకా పొడిగిస్తారా? అన్న సందేహాలపై రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ స్పష్టత ఇవ్వలేదు.

న్యాయవాదులు సీఓపీ వెరిఫికేషన్ చేసుకోవాలి

అనంతపురం క్రైం, జూలై 12: ప్రతి న్యాయవాది సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ (సీఓపీ) వెరిఫికేషన్ చేసుకోవాల్సిందేనని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు గురుప్రసాద్, రాజేంద్రప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న న్యాయవాదులు, 2020లో బార్‌కౌన్సిల్ నుంచి సీఓపీ కార్డు పొందిన ప్రతి న్యాయవాది రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ గెజిట్ విడుదల చేసిందన్నారు. ప్రతి న్యాయవాది తమ విద్యార్హత ధ్రువీకరణపత్రాలను బార్ అసోసియేషన్ ఆమోదంతో ఎస్‌బీఐ చలానా రూ.500 చెల్లించి బార్‌కౌన్సిల్ ఆఫ్ ఏపీకి పంపాలన్నారు.

నిస్సార పరీక్షా కేంద్రాలు

- భూసార పరీక్షలు కావాలంటే 'అనంత'కు వెళ్లాల్సిందే..
- మూడు కేంద్రాల మూసివేత
- రైతులకు తప్పని తిప్పలు



ధర్మవరంలో మూతపడిన భూసార పరీక్షాకేంద్రం

ధర్మవరం, జూలై 12: రైతులకు ఎంతో అవసరమైన భూసార పరీక్షా కేంద్రాలను గత వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసింది. దీంతో రైతులు పంటలు పెట్టే సమయంలో భూసార పరీక్షలు చేయించుకోవాలంటే నానా తిప్పలు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో భూసార, నీటి పరీక్షా కేంద్రాలు పనిచేయకపోవడంతో రైతులు అనంతపురం లేదా ప్రైవేటు పరీక్షా కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని శ్రీసత్యసాయి జిల్లాలోని రైతులు వాపోతున్నారు. పొలాల్లో మట్టిసాంద్రత, నీటిలో లవణ శాతం తెలుసుకోవాలంటే భూసార పరీక్షా కేంద్రాలకు మట్టి, నీటిని తీసుకెళ్లాల్సి ఉంటుంది. జిల్లాలో కదిరి, పెనుకొండ, ధర్మవరం డివిజన్ కేంద్రాల్లో ఉన్న వ్యవసాయ మార్కెట్‌లోని భూసార పరీక్షా కేంద్రాలకు తీసుకెళితే అవి అక్కడ మూతపడి ఉన్నాయని, దీంతో తాము ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండ్ల మొక్కలు, ఇతర పంటలు సాగుచేసే సమయంలో భూసార, నీటి నమూనా పరీక్షలు ఎంతో కీలకం. పరీక్షా కేంద్రాలు మూతపడడంతో ఎంతో వ్యయప్రయాసలకోర్చి అనంతపురంలోని ల్యాబ్‌కు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైసీపీ ప్రభుత్వం ఆర్బీకే కేంద్రాల ద్వారా నీరు, మట్టి పరీక్షలు రైతుల పొలాల్లోనే నిర్వహిస్తామని ఎంతో ఆర్భాటంగా ప్రకటించింది. అధికారులు మట్టి పరీక్షలపై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. భూసార పరీక్షా కేంద్రాలకు నిధులు మంజూరు చేయకపోవడంతో అవి మూతపడ్డాయని ఆ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. వ్యవసాయ అధికారులు భూసార, నీటి పరీక్షలు చేయించుకోవాలని రైతులకు గ్రామ సభల ద్వారా తెలియజేస్తున్నారు. సిబ్బంది మట్టి, నీటిని తీసుకెళుతున్నారని, ల్యాబ్‌లు లేకపోవడంతో వాటి ఫలితాలను తమకు ఇవ్వలేదని రైతులు వాపోతున్నారు. ఆర్బీకేలకు భూసార పరీక్షలకు సంబంధించి నిధులతోపాటు పరికరాలు అందించలేదు. దీంతో తాము మట్టి, నీటి పరీక్షల కోసం అనంతపురం జిల్లాకు పరుగులు తీయాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు అంటున్నారు.

నష్టపోతున్న రైతులు

శ్రీసత్యసాయి జిల్లాలో ప్రధానంగా రైతులు వేరుశనగ, మొక్కజొన్న, దోస, టమోట, కళింగర, ఇతర పంటలను విరివిగాసాగు చేస్తున్నారు. భూసార, నీటి పరీక్షలు చేయించుకోవాలంటేకేంద్రాలు మూతపడ్డాయి. దీంతో రైతులు భూమిలో స్థూలపోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియం, జింక్, ఐరన్ ఎంత నిష్పత్తిలో ఉన్నాయో తెలియక అధిక మోతాదులో రసాయనిక ఎరువులు వాడుతుండటంతో సాగు చేసిన పంటలు పండక నష్టపోతున్నారు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం భూ సార పరీక్షా కేంద్రాలకు నిధులు కేటాయించి వాటిని వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఐదేళ్లయినా ల్యాబ్ లేదు

గత ప్రభుత్వంలో వైఎస్ఆర్ అగ్రిల్యాబ్ ద్వారా భూసార, నీటి పరీక్షలు చేస్తామని అధికారులు తెలిపారు. ఐదేళ్లవుతున్నా ఇంతవరకు మండల కేంద్రం కొత్తచెరువులోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఉన్న వైఎస్ఆర్ అగ్రిల్యాబ్ పరీక్షలకు నోచుకోలేదు. దీంతో మట్టి, నీటి పరీక్షల కోసం ఇబ్బందులు పడుతున్నాం.



\- అశోక్, రైతు, కొత్తచెరువు

త్వరలో వినియోగంలోకి తెస్తాం

మైనర్ సమస్యల వల్ల ల్యాబ్‌లు ప్రస్తుతంలో వినియోగంలో లేవు. వాటి మరమ్మతులకు నిర్వహణ నిధుల కోసం ప్రభుత్వానికి నివేదికను పంపించాం. త్వరలోనే వాటిని వినియోగంలోకి తీసుకు వస్తాం.

\- సుబ్బారావు, జిల్లా వ్యవసాయ అధికారి

దశలవారీగా చేనేతల సమస్యలు పరిష్కరిస్తాం



ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి సవిత



మగ్గాన్ని పరిశీలిస్తూ..

మంత్రి సవిత

హిందూపురం(సోమందేపల్లి), జూలై 12: దశలవారీగా చేనేతల సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. సోమందేపల్లిలోని వెంకటేశ్వర కల్యాణమండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన చేనేతల ఆత్మీయ సమావేశానికి మంత్రి హాజరయ్యారు. చేనేతలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. మండలంలో చేనేత క్లస్టర్ ఏర్పాటు చేయడంతోపాటు అర్హులైన వారికి సబ్సిడీతో రూ.5లక్షల రుణం అందిస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మరమగ్గాలకు 500యూనిట్లు, చేతిమగ్గాలకు 200 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇస్తామన్నారు. నేసిన చీరలకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు మార్కెటింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఒక బ్యాంకే ఉండటంతో లావాదేవీలకు కష్టంగా మారిందన్నారు. మరో బ్యాంకును ఏర్పాటు చేయాలన్నారు. 2010లో పదివేల మగ్గాలకుపైగా ఉండగా చేనేత రంగం సంక్షోభంలో కూరుకుపోవడంతో చాలావరకు కనుమరుగయ్యాయన్నారు. ముద్రారుణాల ద్వారా విరివిగా లోన్లు అందించడం, కేంద్ర ప్రభుత్వం అందించే రూ.5వేలు రాష్ట్రంలో కూడా అమలు చేయాలన్నారు. చేనేతలకు గుర్తింపు కార్డులను పునరుద్ధరించి అర్హులైన చేనేతలందరికీ రూ.24వేలుఆ ర్థిక సాయం, ప్రత్యేక వీవర్స్‌కాలనీ ఏర్పాటు చేయాలన్నారు. చేనేతలు వేసే డిజైన్ల కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రం ఏర్పాటుచేసి అప్పుల భారంతో మృతిచెందిన కుటుంబాలకు ఆర్థిక చేయూతనందించాలన్నారు. బీమా సౌకర్యాన్ని కల్పించాలని పలు డిమాండ్లను ఆమె ముందుంచారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. చేనేతల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటుందని ఆమె స్పష్టం చేశారు.

మగ్గాలను పరిశీలించిన మంత్రి

సోమందేపల్లిలోని దుర్గానగర్‌లో మల్లికార్జునకు చెందిన చేతిమగ్గాన్ని, నాగరాజుకు చెందిన మరమగ్గాన్ని మంత్రి సవిత పరిశీలించారు. వారు నేసిన చీరలను పరిశీలించారు. వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. త్వరలోనే చేనేతల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలను మంత్రి సవిత తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన ఎలా సాగుతుందని ఆరాతీశారు. మధ్యాహ్న భోజనానికి వినియోగిస్తున్న రేషన్, కోడిగుడ్లను పరిశీలించారు. ఆయా పాఠశాలలో మౌలిక వసతులు, సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ రామాంజినేయులునాయక్ స్థానికంగా నెలకొన్న సమస్యలను ఆమెకు వివరించారు. ఉపాధ్యాయులతో భేటీ అయిన ఆమె నాణ్యమైన విద్యాబోధన అందించాలని ఆదేశించారు. 117జీఓ రద్దు అంశాన్ని ఉపాధ్యాయులు.. మంత్రి దృష్టికి తెచ్చారు. అక్కడి నుంచి బీసీ బాలికల సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. నూతనంగా నిర్మించిన వసతి గృహంలో 18గదులు, ఒకహాల్ ఉండగా కేవలం నాలుగు గదుల్లోనే విద్యార్థులున్నట్లు గుర్తించారు. తహసీల్దార్ అంజనానాయక్, ఎంఈఓలను వివరణ కోరారు. వారు మాట్లాడుతూ.. వసతి గృహం చాలా కాలం వినియోగంలో లేకపోవడంతో దుండగులు తలుపులు, కిటికీలు తస్కరించారన్నారు. హాస్టల్‌లో వసతుల కల్పనకు తోడ్పాటు అందిస్తామని మంత్రి తెలిపారు. అనంతరం నిరుపయోగంగా ఉన్న మరో హాస్టల్‌ను తనిఖీచేసి దానిని పాఠశాల అవసరాలకు వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు.

అట్టహాసంగా సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవం

సందడి చేసిన సినీతారలు.. కేరింతలు కొట్టిన యువత



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీతారలు

అనంతపురం కల్చరల్, జూలై 12: జిల్లాకేంద్రంలోని క్లాక్‌టవర్ సమీపంలో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ 35వ బ్రాంచి ప్రారంభోత్సవాన్ని శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌తోపాటు సినీ తారలు అనసూయ భరద్వాజ్, నిధి అగర్వాల్ ముఖ్యఅతిథులుగా హాజరై రిబ్బన్ కట్‌చేసి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం వినాయకుడి ముందు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ జిల్లాలో తయారైన పట్టుచీరలను సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ నిర్వాహకులు తీసుకుని విక్రయించి, తయారీదారులకు ఉపాధి కల్పించాలని కోరారు. అదేవిధంగా స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. సినీనటులు అనసూయ, నిధి అగర్వాల్ మాట్లాడుతూ మధ్యతరగతి ప్రజలకు సైతం అందుబాటు ధరల్లో ఉండేలా సౌత్ ఇండియా షాపింగ్‌మాల్‌ను అనంతలో నెలకొల్పడం శుభపరిణామమని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి సినీతారలు వస్తున్నారన్న సమాచారంతో అభిమానులు, యువత పెద్దసంఖ్యలో షాపింగ్‌మాల్ వద్దకు చేరుకున్నారు. సినీతారలు అక్కడికి చేరుకోగానే ఈలలు వేస్తూ కేరింతలు కొట్టారు. మరోవైపు సినీతారలు అనసూయ భరద్వాజ్, నిధి అగర్వాల్‌లు సినిమా పాటలకు డ్యాన్సులు వేస్తూ వీక్షకులను మరింత ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో షాపింగ్‌మాల్ ఎండీలు రాజమౌళి, వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు సురేష్, అభినయ్, మాజీ మేయర్ స్వరూప, మాల్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సినీ తారలు నిధి అగర్వాల్, అనసూయ

రేపటి నుంచి సత్యసాయి క్రికెట్ లీగ్ పోటీలు

పుట్టపర్తి, జూలై 12

శ్రీసత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో పుట్టపర్తిలోని హిల్‌వ్యూ స్టేడియంలో ఆదివారం నుంచి సత్యసాయి క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించనున్నారు. భారత్ లెవెన్, గ్లోబల్ లెవెన్ మధ్య ప్రారంభ మ్యాచ్ జరగనుంది. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులతో కలిసి భారత మాజీ క్రికెటర్ మురళీ కార్తీక్ పోటీలను ప్రారంభిస్తారు. సత్యసాయి సేవాసంస్థల సభ్యులు మాత్రమే క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొనడానికి అర్హులు. ఏడాదిపాటు జరిగే ఈ పోటీలు తొలుత సత్యసాయి సమితి స్థాయిలో నిర్వహిస్తారు. తరువాత ఇంటర్ సమితి, జిల్లా, అంతర్ జిల్లా, అంతర్రాష్ట్ర, జోనల్ స్థాయిలలో నిర్వహిస్తారు. 2025 జూలై 14న పుట్టపర్తిలోని సత్యసాయి హిల్‌వ్యూ స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తారు. ఈ స్టేడియంలో 27 ఏళ్ల క్రితం వరల్డ్ లెవెన్, ఇండియా లెవెన్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో తొలిసారి జరిగిన ప్రపంచస్థాయి క్రికెట్ పోటీలను వీక్షించడానికి క్రీడాభిమానులు అప్పట్లో ఎగబడ్డారు. భారత్ లెవెన్ జట్టు ఆ మ్యాచ్‌లో విజయం సాధించింది.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి

ఎస్సీ సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫౌండేషన్ ద్వారా అందించే వైద్యసేవలను షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారు ఉపయోగించుకోవాలని ఎస్సీ సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. షెడ్యూల్డ్ కులాల వారు తీవ్రమైన అనారోగ్యాలు, కిడ్నీ, గుండె, కాలేయం, క్యాన్సర్, మెదడు, అవయవ మార్పిడి, వెన్నెముక శస్త్ర చికిత్సతోపాటు ఏదైనా ప్రాణాంతక వ్యాధితో బాధపడుతుంటే ఈ పథకం ద్వారా వైద్య సహాయం అందిస్తారన్నారు. షెడ్యూల్డ్ కులం, షెడ్యూల్డ్ తెగ కమ్యూనిటీకి చెందిన వారు అర్హులన్నారు. శస్త్రచికిత్సకు కనీసం 15 రోజుల ముందు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫౌండేషన్ డైరెక్టర్, న్యూఢిల్లీకి వివరాలు పంపాలన్నారు. చికిత్స అంచనా వ్యయంలో 100 శాతం నేరుగా సంబంధిత ఆస్పత్రికి నెఫ్ట్ లేదా ఆర్‌టీజీఎస్ ద్వారా సీలింగ్ పరిమితితో విడుదల చేస్తారన్నారు. గుర్తింపు పొందిన ఆస్పత్రుల్లో ఈ వైద్య చికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. వివరాలకు ambedkarfoundation.nic.in వెబ్‌సైట్ లేదా అనంతపురంలోని ఎస్సీ సంక్షేమశాఖ, తాడిపత్రి, అనంతపురం, కళ్యాణదుర్గం, గుత్తి, ఉరవకొండలోని సాంఘిక సంక్షేమ అధికారులను సంప్రదించాలన్నారు.

చీనీకాయలు టన్ను రూ.18వేలు

అనంతపురం రూరల్, జూలై 12: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 944 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.48

అనంతపురం రూరల్, జూలై 12: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.48తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం 83 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.42, కనిష్ఠ ధర రూ.33 పలికినట్లు ఆయన తెలిపారు.

టీబీ డ్యాంలో 29 టీఎంసీల నీరు



టీబీ డ్యాంలో నీటి నిల్వ

బొమ్మనహాళ్, జూలై 12: తుంగభద్ర జలాశయంలోకి శుక్రవారం 29.161 టీఎంసీలు చేరాయి. శుక్రవారం ఉదయానికి 21,643 క్యూసెక్కులకు చేరింది. కొద్ది రోజులుగా ఇన్‌ఫ్లో హెచ్చు తగ్గుల మధ్య కొనసాగుతుంది. ప్రస్తుతం జలాశయంలో 105.788 టీఎంసీల పూర్తి మట్టానికి గాను 29.161 టీఎంసీల వరకు నీరు నిల్వ అయ్యాయి. అవుట్‌ఫ్లో 205 క్యూసెక్కులుండగా 1633 అడుగుల డ్యాం ఎత్తుకు గాను 1605.28 అడుగుల వరకు నీరు చేరింది.

కోర్టులో లొంగిపోయిన నిందితుడు

టీడీపీ కార్యకర్త ఆదెప్ప హత్యకేసు..



కేశవరెడ్డిని రిమాండ్‌కు తీసుకెళ్తున్న పోలీసులు

కళ్యాణదుర్గం రూరల్, జూలై 12

రాయదుర్గం మండలం మెచ్చిరి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఆదెప్ప ఈనెల 9వ తేదీన దారుణ హత్యకు గురయ్యాడు. అప్పటి నుంచి పోలీసులు నిందితుడి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ నిందితుడు పోలీసులకు దొరకలేదు. శుక్రవారం రాత్రి నిందితుడు మెచ్చిరి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కేశవరెడ్డి న్యాయవాదుల ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ కోర్టులో లొంగిపోయాడు. న్యాయాధికారి సుభాన్ నిందితుడికి 14 రోజులపాటు రిమాండ్ విధించారు. నిందితుడి ఫొటోలను విలేకరులు తీస్తుండగా.. పోలీసులు అడ్డుపడ్డారు.

శిథిల భవనంలో వసతి



సౌకర్యాలు లేని వసతి గృహం



ప్రహరీలేని వసతి గృహం

- శిథిలావస్థలో కదిరి వసతి గృహం
- 90 మందికి మూడు గదులే
- చిన్నపాటి వర్షానికే కారుతున్న వైనం
- కూలిన ప్రహరీ.. కరువైన రక్షణ
- పెచ్చులూడుతున్న కప్పు
- సమీపంలోని పాఠశాలలో నిద్ర
- శుద్ధినీటి సౌకర్యమూ లేదాయె..

కదిరి అర్బన్, జూలై 12: స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ఎస్సీ బాలికల వసతి గృహం శిథిలావస్థకు చేరుకుంది. 50 ఏళ్ల క్రితం ఈ భవనాన్ని నిర్మించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్వహణ సరిగా లేకపోవడంతో సమస్యలు తిష్ట వేశాయి. చిన్నపాటి మరమ్మతులనూ అధికారులు, పాలకులు చేయించలేదు. స్లాబ్ నుంచి పెచ్చులూడి పడుతుండడంతో కొన్ని గదులను మూసివేశారు. మిగిలిన గదుల పరిస్థితీ అలాగే ఉండటంతో... పగటి పూట మాత్రమే బాలికలు వసతి గృహంలో ఉంటారు. రాత్రి భోజనం తరువాత సమీపంలోని రాణిపేట మున్సిపల్ పాఠశాలలో వీరు నిద్ర చేయడానికి వెళ్తున్నారు. ఉదయం తిరిగి వసతి గృహానికి వెళ్తున్నారు. ఈ భవనానికి ఉన్న ప్రహరి గతంలో కురిసిన వర్షాలకు కూలింది. దీంతో బాలికలకు రక్షణ కూడా కరువైంది. చిన్నపాటి వర్షానికే భవనం కారుతోంది. ఈ వసతి గృహంలో ప్రస్తుతం 90 మంది విద్యార్థులకు కేవలం మూడు గదులే ఉన్నాయి. దీంతో ఆ గదులు వారికి సరిపోవడం లేదు. ఇంతమంది బాలికలకు కేవలం ఐదారు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. వాటికి తలుపులు కూడా లేవు. శుద్ధ తాగునీటి సౌకర్యమూ లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో బోరునీటినే తాగాల్సి వస్తోంది. ఇన్ని సమస్యలతో ఈ వసతి గృహంలో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



పెచ్చులూడిన భవనం



తలుపులు లేని మరుగుదొడ్లు

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

వసతి గృహం భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనం కారుతోంది. పెచ్చులూడుతోంది. ఈ సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి గతంలో తీసుకెళ్లాం. ప్రస్తుత ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికీ తీసుకెళ్లాం.

- ప్రసన్నకుమారి, ఎస్సీ బాలికల వసతిగృహం, వార్డెన్

ఈపీఆర్ఏ ద్వారా భూముల గుర్తింపు

తనకల్లు, జూలై 12: జనజాగృతి ఆధ్వర్యంలో మండలంలోని గేమేనాయక్‌తండా పంచాయతీలో ఈపీఆర్ఏ (ఎలక్ట్రానిక్ పార్టిసిపేటరీ రూరల్ అప్రిజల్) కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గూగుల్ అర్త్ మ్యాప్ ద్వారా గ్రామానికి చెందిన బీడు భూములు, వ్యవసాయ బోర్లు, వంకలు, వాగులు, అడవులు, చెరువులు, కుంటలు తదితర వాటిని గుర్తించారు. అంతేకాకుండా గ్రామంలోని రైతులకు ఒక్కొక్కరికి ఎంత భూమి ఉంది.. ఎన్నిచోట్ల ఉంది.. ఎలాంటి భూమి.. తదితర విషయాలను జనజాగృతి సభ్యులు నమోదు చేశారు. తద్వారా వచ్చే నాలుగేళ్లలో గేమేనాయక్, పోమేనాయక్, రామలానాయక్, మొగిలిచెట్ల తండాల్లో ఒక్క ఎకర భూమి కూడా బీడు లేకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగులోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వారు వివరించారు. రైతులకు రక్షక తడులు అందించే విషయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జనజాగృతి సాంకేతిక నిపుణుడు చంద్రమోహన్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



భూములను గుర్తిస్తున్న జనజాగృతి సభ్యులు, గ్రామస్థులు

మంత్రి దృష్టికి సమస్యలు

కదిరి(అమడగూరు), జూలై 12: అమడగూరు మండలంలో నెలకున్న సమస్యలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖమంత్రి సత్యకుమార్ దృష్టికి బీజేపీ మండలాధ్యక్షుడు ఇందుకూరి సురేంద్రరెడ్డి తీసుకెళ్లారు. శుక్రవారం ఈ మేరకు జిల్లా కేంద్రంలో మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట నాయకులు సుబ్బిరెడ్డి, రామయ్య, కూటమి కార్యకర్తలు ఉన్నారు.

రేపు హ్యాండ్‌బాల్ పోటీలు

కదిరిఅర్బన్, జూలై 12: స్థానిక ఎస్‌టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో హ్యాండ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక చేస్తున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ సెక్రటరీ మహేష్ శుక్రవారం ఓ ప్రటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 10 గంటలకు కళాశాల ఆవరణానికి చేరుకోవాలని, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలని అన్నారు. వివరాలకు 97041 40510ను సంప్రదించాలని కోరారు.

కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ

కొత్తచెరువు, జూలై 12: స్థానిక మరువ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద కల్వర్టు నిర్మాణానికి వార్డు మెంబరు రమేశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శి సురేంద్రరెడ్డి, సర్పంచ్ భర్త నాగరాజు శుక్రవారం భూమిపూజ చేశారు. నాగరాజు మాట్లాడుతూ... డ్రైనేజీలు లేకపోవడంతో ఎగువ భాగం నుంచి మురుగు నీరు దేవాలయం ఎదుట ప్రవహిస్తుండటంతో గుడికి వచ్చే భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విషయాన్ని ప్రజలు, భక్తులు తమ దృష్టికి తీసుకురావడంతో రూ.1.50 లక్షలతో కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు.

విద్యాసామగ్రి అందజేత

తాడిమర్రి, జూలై 12: మండలంలోని నిడిగల్లు, చిల్లకొండయ్యపల్లి పాఠశాల్లోని విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన విద్యాసామగ్రిని శుక్రవారం అందజేశారు. నిడిగల్లులో జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్, చిల్లకొండయ్యపల్లిలో బీజేపీ నాయకుడు కొంకా నాగార్జున వాటిని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే

ఓబుళదేవరచెరువు, జూలై 12: మండలంలోని వడ్డివారిపల్లి వద్ద మస్తాన్ సీబీఎస్‌సీ పాఠశాలలో ఫ్రెషర్స్‌డేని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ లత, వైస్ ప్రిన్సిపల్ పర్వేజ్ బేగం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ మస్తాన్, డ్యాన్స్ మాస్టర్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపల్ లత

డిగ్రీ కళాశాలను పరిశీలించిన న్యాక్ బృందం

కదిరి అర్బన్, జూలై 12: స్థానిక ఎస్‌టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) సభ్యులు శుక్రవారం పరిశీలించారు. కౌన్సిల్ చైర్మన్ క్రిష్ణపిళ్లై పద్మాకర్ ఆధ్వర్యంలో సభ్యులు అన్నా సాహెల్, డాక్టర్ ఫాల్‌న్యూమెన్ పరిశీలించారు. వీరికి ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత, అధ్యాపక బృందం, విద్యార్థులు స్వాగతం పలికారు. ఎన్‌సీసీ క్యాడెట్లు గౌరవ వందనం చేశారు. అనంతరం కళాశాలలో ఐదు సంవత్సరాల్లో జరిగిన అభివృ ద్ధి కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రిన్సిపాల్ వివరించారు. వివిధ డిపార్టుమెంట్లలో సాధించిన ప్రగతిని, భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. న్యాక్ బృందం ల్యాబ్‌లు, సెంట్రల్ లైబ్రరీ, జిమ్, కెరియర్ గైడెన్స్ సెల్‌ను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేసింది. సాయంత్రం కమిటీ సభ్యులు.. కళాశాల పూర్వ విద్యార్థులతో సమావేశమయ్యారు. అనంతరం కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు.



పూర్వ విద్యార్థులతో సమావేశమైన న్యాక్ బృందం

పంటల గిట్టుబాటు ధరకు చట్టబద్ధత కల్పించాలి

ధర్మవరం, జూలై 12: పంట గిట్టుబాటు ధరకు చట్టబద్ధత కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ... ఈనెల 18,19 తేదీల్లో జిల్లాలో రైతు, కౌలు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామ సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకంలో పనిదినాలు 200 రోజులకు పెంచాలని, రోజువారీ వేతనం రూ.600 ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే ప్రక్రియను రద్దు చేయాలని, రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, బ్యాంకులలో రుణాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్‌బాషా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జేవీ రమణ, సీపీఎం పట్టణ కార్యదర్శి శేషంపల్లి మారుతి, సీఐటీయూ నాయకులు ఎల్ ఆదినారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

మత్తు పదార్థాలతో అనర్థాలపై అవగాహన

ధర్మవరం, జూలై 12: మత్తు పదార్థాలకు అలవాటు పడితే జరిగే అనర్థాలపై సెబ్ సీఐ గురుప్రసాద్ స్థానిక పద్మావతి మహిళా డిగ్రీకళా శాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు యువతీ యువకులు బానిసై జీవితాలను నాశనం చేసుకుం టున్నారన్నారు. కావున మత్తు పదార్థాల కు దూరంగా ఉండాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున, అధ్యాపకులు, సెబ్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సెబ్ సీఐ గురుప్రసాద్

హంతకులను కఠినంగా శిక్షించాలి

ధర్మవరం, జూలై 12: నంద్యాల జిల్లాలో ఇటీవల ఓ చిన్నారిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వాల్మీకి సంఘం నాయకులు.. ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా పట్టణంలో శుక్రవారం వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద ఆ చిన్నారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అ చిన్నారి కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు సాకేమద్దిలేటి, బోయర వించంద్ర, గొట్లూరు చంద్ర, బొట్టుకిష్ట, పూజా మొబైల్ సాయి పాల్గొన్నారు.



చిన్నారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ఐసీడీఎస్ పీడీకి ఫిర్యాదు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

అంగన్‌వాడీ వర్కర్‌పై పీడీకి ఫిర్యాదు

పుట్టపర్తిరూరల్, జూలై 12: ఓబుళదేవరచెరువు మండలంలోని వీరప్పగారి పల్లె మినీ అంగన్‌వాడీ సెంటర్లో వర్కర్ నాగమణి విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని, పిల్లలకు పోషక పదార్థాలను ఇవ్వడం లేదని ఆ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో పీడీ నాగమల్లేశ్వరికి ఫిర్యాదు చేసిన వారు మాట్లాడారు. నాగమణి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, తల్లిదండ్రులు ఎవరైనా ప్రశ్నిస్తే తనకు ఉన్నతస్థాయి అధికారులు, యూనియన్ నాయకుల అండ ఉందని, తనను ఎవరూ ఏమీ చేసుకోలేరని బెదిరిస్తూ ప్రశ్నించిన వారిపై దాడులు చేయిస్తోందని వాపోయారు. పిల్లల పట్ల నిర్లక్ష్యవైఖరి చూపుతున్న ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై పీడీ స్పందిస్తూ.. సూపర్వైజర్, సీడీపీఓలను విచారణ కోసం పంపుతామని, విచారణలో లోపాలు తేలితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

నల్లమాడ, జూలై 12: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సునీతాబాయి అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశాన్ని తూతూమంత్రంగా నిర్వహించారు. ప్రజాసమస్యలపై సభ్యులు నోరుమెదపలేదు. దీంతో తమకు అవకాశమిస్తే సమస్యలను వివరిస్తామని టీడీపీ నాయకుడు మట్రా రాజశేఖర్, రైతు సంఘం కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి సమావేశంలో ఎంపీడీఓ మహమ్మద్ దౌలాను విజ్ఞప్తి చేశారు. ఆయన అనుమతి ఇవ్వడంతో జల్‌జీవన్ మిషన్, నాడు నేడు పనులు, ప్రభుత్వ పథకాల్లో అవినీతి అక్రమాలు జరిగాయని, వాటిని పరిశీలించాలని వినతిపత్రం అందించారు. స్పందించిన ఎంపీడీఓ ఆ పనులపై విచారణ చేపడతామన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ నాగభూషణం, జెడ్పీటీసీ రమచంద్రారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

తిరుమలకు బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

నంబులపూలకుంట, జూలై 12: కదిరి నుంచి తిరుమలకు బస్సు సర్వీసును పునరుద్ధరించాలని సభ్యులు కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ రాము అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ రాణెమ్మ ఆజెండాను చదివి వినిపించారు. సభ్యులు మాట్లాడుతూ... కదిరి నుంచి రాయచోటికి ఒకదాని వెనుక ఒకటి ఐదు నిమిషాల్లో వ్యవధిలోనే ఐదు బస్సులు ఉన్నాయని, అలాకుండా 20 నిమిషాలకు ఒక బస్సు చొప్పున ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు ఇబ్బంది ఉండదని అన్నారు. కదిరి నుంచి రాయచోటికి లాస్ట్ బస్సు రాత్రి 7.30కు ఉందని, ఆ తర్వాత లేవని, కదిరిలో చుట్టు పక్కల ప్రాంతాల విద్యార్థులు చాలామంది చదువుకుంటున్నారని, వారి సౌకర్యార్థం రాత్రి 9 గంటలకు మరో బస్సు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ నరేంద్రకుమార్, ఈఓఆర్డీ మనోహర్‌బాబు, ఏఓ లోకేశ్వర్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ ముజామల్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ జయమ్మ, సభ్యులు రంగారెడ్డి, తిమ్మారెడ్డి, కేశవరెడ్డి, రాధమ్మ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కేజీబీవీ తనిఖీ

తనకల్లు, జూలై 12: స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలను డీఎల్‌డీఓ సూర్యనారాయణ శుక్రవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న హెల్త్ క్యాంప్‌ను పరిశీలించారు. కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ధర్మరాజు ఆధ్వర్యంలో బాలికలను పరీక్షించి, మందులు అందించారు. బాలికల రక్త నమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

తాడిమర్రి: స్థానిక కేజీబీవీ పాఠశాలను మండల ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. వంటగదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. సమస్యలపై విద్యార్థులతో ఆరా తీశారు. వంటశాలలోని కోడిగ్రుడ్లు, కూరగాయలను పరిశీలించి నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ మణిమంజరీ, ఎంఈఓలు క్రిష్ణమోహన్, వెంకటేశ్, ఎస్ఓ వాణిశ్రీ, ఏపీఓ సంజీవరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ రవికుమార్, కార్యదర్శి రిజ్వానాబేగం, జూనియర్‌అసిస్టెంట్ ప్రతాప్ ఉన్నారు.

పెనుకొండ బాబయ్యకు ఎస్పీ చాదర్ సమర్పణ



చాదర్ మోసుకెళ్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తిరూరల్, జూలై 12: పెనుకొండ బాబయ్యస్వామి దర్గాకు ఎస్పీ మాధవ రెడ్డి శుక్రవారం కుటుంబ సమేతంగా వెళ్లారు. దర్గా కమిటీ నిర్వాహకులు, మతపెద్దలు ఎస్పీ కుటుంబానికి స్వాగతం పలికారు. ఛాదర్‌ను ఎస్పీ శిరస్సుపై మోసుకుంటూ దర్గాలోకి ప్రవేశించారు. బాబయ్య స్వామికి చాదర్‌ను సమర్పించి... ముజావర్లతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముజావర్లు దర్గా ప్రాశస్త్యం, విశిష్టతను ఎస్పీకి తెలిపారు. ఆయన వెంట పెనుకొండ సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ రంగడు, సిబ్బంది ఉన్నారు.

ఒలింపియాడ్‌లో ప్రతిభ



ప్రతిభ కనబరచిన విద్యార్థులు

ధర్మవరం, జూలై 12: ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ పరీక్షలలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచినట్టు స్థానిక రూపారాజా వీసీఎంఆర్ పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ శుక్రవారం తెలిపారు. పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న సాయిషమితారెడ్డి, 6వ తరగతి చదువుతున్న హెన్సిక రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి నగదు బహుమతి సాధించారన్నారు. ఆరుగురు విద్యార్థులు ఎక్సలెంట్ మెడల్ విన్నర్ అవార్డ్స్, 25 మంది గోల్డ్‌మెడల్స్, 15 మంది సిల్వర్ మెడల్స్, 15 మంది బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో చైర్మన్, డైరెక్టర్లు రూపారాజ కృష్ణ, జగదీశ్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేశ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు.. ఆ విద్యార్థులను అభినందించారు.

అనారోగ్యంతో టీడీపీ కార్యకర్త మృతి

ముదిగుబ్బ, జూలై 12: మండల కేంద్రానికి చెందిన టీడీపీ కార్యకర్త మేకల సూరి (57) గురువారం రాత్రి అనారోగ్యంతో మరణించాడు. ఆయన మృతదేహానికి టీడీపీ నాయకులు రమేష్‌బాబు, కరణం ప్రభాకర్, తుమ్మల మనోహర్, సూర్యశేఖర్ రాజు, వినోద్ బాబు, చికెన్ తిరుపాల్, ఆనంద్, రాధమ్మ, రాజు నివాళులర్పించారు. టీడీపీ హిందూపురం పార్లమెంట్ సోషల్ మీడియా కో-ఆర్డినేటనర్ హేమలతా బాయ్ సూరి కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.



అమ్మవారికి శాకంబరి అలంకరణ

శాకంబరి అలంకరణలో పెద్దమ్మతల్లి

ధర్మవరం, జూలై 12: పట్టణంలోని సాలేవీధిలో పెద్దమ్మతల్లిని ఆషాఢమాసం శుక్రవారం సందర్భంగా శాకంబరీదేవిగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు బుగ్గవంశస్థుల ఆధ్వర్యంలో అర్చకుడు వెంకటేశ్వర శర్మ అమ్మవారిని ఆకుకూరలు, కూరగాయలతో అలంకరించారు. 21 రకాల కూరగాయలు, 11 రకాల ఆకుకూరలతో ఈ అలంకారం చేశారు. మహిళలు.. పెద్దమ్మతల్లి కీర్తనలు ఆలపించారు.

అప్పులబాధతో చిరువ్యాపారి ఆత్మహత్య



సుధాకర్ (ఫైల్)

ముదిగుబ్బ, జూలై 12: స్థానిక వాసి కొండేటి సుధాకర్ (45) అప్పుల బాధ తాళలేక గురువారం అర్ధరాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతను, అతని భార్య హరిత తోపుడుబండిపై కూరగాయల వ్యాపారం చేసుకొంటూ జీవనం సాగించేవారు. కూతురు చదువు, వివాహం కోసం దాదాపు రూ.5 లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలో అర్థం కాగా మానసికంగా క్షోభ అనుభవించేవాడు. కొత్తచెరువులో ఉన్న కుమార్తె ప్రసవం కావడంతో చూడడానికి భార్య భర్త వెళ్లారు. భార్యను కొత్తచెరువులోనే కూతురుకు తోడుగా ఉంచి.. సుధాకర్ తిరిగి ముదిగుబ్బకు వచ్చాడు. అప్పులతో జీవితంపై విరక్తి చెందిన సుధాకర్ ఇంటిలో ఎవరూలేని సమయంలో గురువారం రాత్రి ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఎంతసేపటికీ ఇంటి తలుపులు తీయకపోవడంతో చుట్టుపక్కలవారు కిటికిలో చూశారు. సుధాకర్ ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించి.. అతని భార్య హరితకు సమాచారం అందించారు. హరిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. సుధాకర్ మృతదేహాన్ని కదిరి ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యుదాఘాతంతో టిప్పర్ డ్రైవర్ మృతి



రషీద్‌ఖాన్ (ఫైల్)

తనకల్లు, జూలై 12: మండలంలోని చీకటిమానిపల్లి వద్ద విద్యుదాఘాతంతో టిప్పర్ డ్రైవర్ రషీద్‌ఖాన్ (20) అక్కడికక్కడే మరణించాడు. టీ. సదుం గ్రామానికి చెందిన బాబ్‌జాన్ చీకటిమానిపల్లి వద్ద ఉన్న కంపోస్టు యార్డులో టిప్పర్ డ్రైవర్. శుక్రవారం బాబ్‌జాన్ నమాజుకు వెళ్తూ... తన కుమారుడు రషీద్‌ఖాన్‌ను టిప్పర్ డ్రైవర్‌గా వెళ్లాలని సూచించాడు. టిప్పర్ కోసం వెళ్లిన రషీద్ ఖాన్ అందులో డీజల్ లేకపోవడంతో ట్రిపర్ ట్ర్యాలీని లిఫ్ట్ చేసి... కిందకు దిగాడు. ఆ టిప్పర్ ఆపిన ప్రాంతం లో ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లకు తగిలింది. ఇది గమనించిన రషీద్‌ఖాన్ టిప్పర్‌లోకి ఎక్కడానికి ప్రయత్నించి.. విద్యుదా ఘాతానికి గురై అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లారు. బాబ్‌జాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ ధరణీబాబు తెలిపారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ధర్మవరం రూరల్, జూలై 12: మండలంలోని బిల్వంపల్లి గ్రామానికి చెందిన గోపాల్ భార్య కళమ్మ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కొద్దిసేపటికి గమనించిన కుటుంబసభ్యులు ఆమెను వెంటనే ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ధర్మవరం రూరల్: మండలంలోని గొట్లూరు గ్రామ అనాథాశ్రమం సమీపంలో ఆగి ఉన్న బైక్‌ను వేగంగా వచ్చిన బైక్ ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. బత్తలపల్లి మండలం ఈదుల ముష్టురుకు చెందిన రామకృష్ణ తన ద్విచక్రవాహనాన్ని గొట్లూరు గ్రామం వద్ద రోడ్డు పక్కన ఆపాడు. అదేగ్రామానికి చెందిన చిరంజీవి ద్విచక్రవాహనంలో వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొట్టగా ఇద్దరూ కిందపడ్డారు. ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనం ద్వారా ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పండ్లమొక్కలకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, జూలై 12: మండలంలో మెట్టపొలం ఉన్న రైతులు పండ్ల మొక్కల సాగుకు దరఖాస్తు చేసుకోవాలని ఉపాధి హామీ ఏపీఓ నాగిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎకరా నుంచి ఐదెకరాలోపు ఉన్న రైతులు, జాబ్ కార్డు ఉన్నవారు అర్హులని, దరఖాస్తుతో పాటు భూమి పాసుపుస్తకం 1బీ, ఆధార్, సన్నచిన్నకారు సర్టిఫికెట్, బ్యాంకు ఖాతా పత్రులను అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు మామిడి, జామ, సపోట, చీని, అల్లునేరేడు, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి మొక్కలు, సీతాఫలం, గంగిరేని మొక్కలు, చింతా, మునగ, గులాబి, మల్లె 1/4 ఎరాకు మాత్రమే మంజూరు చేస్తామన్నారు. ఆసక్తిగల రైతులు ఈనెల 15లో దరఖాస్తులు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 63090 19817ను సంప్రదించాలని సూచించారు.

27న రక్తదాన శిబిరం

కదిరి(అమడగూరు) : అమడగూరులో ఈ నెల 27న రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యూత్ అసోషియేషన్ సభ్యులు తెలిపారు. శుక్రవారం అమడగూరులోని జూనియర్ కళాశాలలో వారు మాట్లాడుతూ... ఆసక్తిగలవారు 97382 03053కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రెసిండెంట్ నాగార్జున, రామాంజి, శివ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



ప్రియాంక

బత్తలపల్లి: మండలంలోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తిచేసిన ప్రియాంక ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకట నాయుడు శుక్రవారం తెలిపారు. ప్రియాంకను తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు అభినందించారు.



మంత్రికి సమస్యలు వివరిస్తున్న ఎంపీఈఓలు

మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన ఎంపీఈఓలు

మడకశిరటౌన్, జూలై 12: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును మడకశిర ఎంపీఈఓల అసోసియేషన్ సభ్యులు శుక్రవారం అమరావతిలో కలిసి తమ సమస్యలను విన్నవించారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అచ్చెన్నాయుడును వారు ఘనంగా సన్మానించారు. అనంతరం తమను విధుల్లో కొనసాగించాలని కోరారు. క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పది రోజుల అనంతరం కలవాలని, సమస్యలపై చర్చించి తప్పక న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎంపీఈఓల అసోసియేషన్ నియోజకవర్గం అధ్యక్షుడు బసవరాజు తెలిపారు. ఈసందర్భంగా ఉపాధ్యక్షుడు అనీల్, నారాయణస్వామి, కార్యదర్శి శశిబాబు, రామాంజనేయులు, పురుషోత్తంరెడ్డి తదితులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి గురుకుల విద్యార్థుల ఎంపిక



తులసీ రామ్



ప్రకాశ్ కుమార్



అరుణ సాయి

మడకశిర రూరల్, జూలై 12: ట్రిపుల్ ఐటీ ప్రవేశ పరీక్షల్లో మండలంలోని గుండుమల ఎంజేపీపీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ సాధించినట్లు ప్రిన్సిపాల్ ఫణీంద్ర కుమార్ తెలిపారు. విద్యార్థి తులసిరామ్ 600 మార్కులకు 577 మార్కులు. హరినాథ్ రెడ్డి, 573, ప్రకాశ్ కుమార్ 573, హరికుమార్ 573 మార్కులు సాధించారన్నారు. ఆమిదాలగొంది ఉన్నత పాఠశాలకు చెందిన అరుణసాయి 571, హేమంత్ 568 మార్కులు సాధించినట్లు హెచ్ఎం తెలిపారు.

లేపాక్షి: స్థానిక ప్రభుత్వ ఓరియంటల్ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి అర్హత సాధించినట్లు ఎంఈఓ నాగరాజునాయక్ తెలిపారు. ఇద్దరు



సాయికిరణ్



ప్రదీప్

విద్యార్థులు విజయం సాధించడంతో పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు. సాయికిరణ్, ప్రదీప్ చదువులోనేకాకుండా స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో చురుగ్గా పాల్గొనేవారన్నారు. తద్వారా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారన్నారు. పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.



గోరంట్లలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గోరంట్ల: ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి గోరంట్ల మండలానికి చెందిన ఏడుగురు విద్యార్థులు అర్హత సాధించారు. గోరంట్ల బాలికోన్నత పాఠశాలలో ఆరుగులు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు మాధవిలత తెలిపారు. గోరంట్లకు చెందిన నీహాఫిర్‌దోష్ 585 మార్కులు, నవ్యశ్రీ 577, భాగ్యశ్రీ 575, హిమవర్షిత 575, పూజిత 574, కుసుమ 573 మార్కులు సాధించారన్నారు. నారాయణ పాఠశాలకు చెందిన చైతన్య కుమార్ 587 మార్కులతో ట్రిపుల్ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ లక్ష్మీపతి తెలిపారు. గడ్డం తండాకు చెందిన చైతన్యనాయక్‌కు సీటు లభించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



చైతన్యనాయక్

టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

హిందూపురం(సోమందేపల్లి), జూలై 12: మండలంలో టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నాలుగో సచివాలయం, గుడిపల్లి ప్రాంతాలను పరిశీలించి గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు ప్రభుత్వం ద్వారా అందాల్సిన సేవలు అందుతున్నాయా లేదా అని అరాతీశారు. అనంతరం బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు జరిపి ఆరోగ్య పరిస్థితులపై ఆరాతీశారు. ప్రధానమంత్రి మాతృవందనం యోజన కింద తొలిసారి గర్భిణులకు నగదు అకౌంట్‌లో జమ అవుతుందా లేదా అని విచారించారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి హరి, జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు కళాధర్, డీపీఎం నాగరాజు, సిబ్బంది రవీంద్ర, రత్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బాబయ్య దర్గాని దర్శించుకున్న ఎస్పీ

పెనుకొండ, జూలై 12 : ప్రసిద్ధిచెందిన పెనుకొండ బాబయ్య దర్గాను, జిల్లా ఎస్పీ మాధవరెడ్డి కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. శుక్రవారం దర్గాకు వచ్చిన ఎస్పీకి దర్గా నిర్వాహకులు సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు.



ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

అనంతరం ఆయన చాదర్‌ను శిరస్సుపై ఉంచుకుని బాబయ్య సమాధికి కప్పి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని ప్రాచీన కట్టడాలైన రాయల వేసవి విడిది గగన్‌మహల్, తిమ్మరుసు సమాధి, బోగసముద్రం చెరువు, యోగముద్ర శివుడి విగ్రహం, వివిధ ఆలయాలను సందర్శించారు. ఆయన వెంట గోరంట్ల సీఐ సుబ్బరాయుడు, కియ స్టేషన్ ఎస్ఐ రంగడు, స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు : కమిషనర్

మడకశిర, జూలై 12: మడకశిర నగర పంచాయతీ పరిధిలో 2019 అనంతరం అనధికారికంగా వేసుకొన్న లేఅవుట్లలో భవన నిర్మాణాలకు అనుమతి ఇచ్చేది లేదని నగర పంచాయతీ కమిషనర్ రంగస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మడకశిర పరిధిలో ఎనిమిది అక్రమ అవుట్లను గుర్తించినట్లు తెలిపారు. ఆదిరెడ్డిపాళ్యం, పెనుకొండరోడ్డు, బేల్దార్ కాలనీ, మధుగిరిరోడ్డు, మల్లినాయకనపల్లి రోడ్డు తదితర చోట్ల గుర్తించామన్నారు. అక్రమ లేఅవుట్లలో ఎట్టి పరిస్థితిలోనూ స్థలాలు కొనవద్దని ప్రజలకు సూచించారు. అనుమతులు లేకుండా వెలిసిన లేఔట్‌లలో ఉన్న హద్దు రాళ్లను ఎక్స్‌కవేటర్‌తో తొలిగించినట్లు తెలిపారు.



హద్దురాళ్లను తొలగిస్తున్న దృశ్యం

తాళం వేస్తే.. ఇల్లు గుల్లే

- పురంలో రెచ్చిపోతున్న దొంగలు
- రాత్రిపూట తగ్గిన గస్తీ
- సిబ్బంది కొరత అంటున్న పోలీసులు



హిందూపురం, జూలై 12: తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా జరుగుతున్న చోరీలు. ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వరుస దొంగతనాలతో పోలీసులకు దొంగలు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. అంటే పోలీసులకంటే వారు ఎంత వేగంగా ఆలోచిస్తున్నారో ఇట్టే అర్థం అవుతుంది. రాత్రి చోరీ జరిగితే మరుసటిదినం మధ్యాహ్నం, సాయంత్రం ఆధారాలు సేకరించే పనిలో పోలీసులు పడతారు. అయితే దొంగతనం చేసిన వారు గమ్యాలకు చేరుకుని ఉంటారు. దీనితరువాత కేసు నమోదు చేయడం, క్లూస్‌టీమ్‌ను రప్పించడం పోలీసులు చేస్తారు. కేసు నమోదు చేసి ఏళ్లుగడిచినా రికవరీ మాత్రం కావు.

పెరిగిన చోరీలు

ఆరు నెలల వ్యవధిలో హిందూపురంలో చోరీలు పెరిగిపోయాయి. నాలుగు నెలల క్రితం హిందూపురం పట్టణంలోని రెండో పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంటికి తాళాలు వేసి బెంగళూరుకు వెళ్లారు. రెండు రోజుల తరువాత వచ్చి చూసేసరికి ఇంటిలో ఉన్న నగలు, నగదు ఎత్తుకెళ్లారు. ఆరు నెలల క్రితం మోడల్ కాలనీ సమీపంలో ఓ ఉపాధ్యాయుడు ఊరికెళ్లాడు. తాళాలు పగలకొట్టి సుమారు 25తులాల బంగారం, అరకిలోకు పైగా వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. దీనిపై కూడా కేసు నమోదు చేశారు. అదేవిధంగా పులమతి రోడ్డు సమీపంలో ఐదు నెలల క్రితం ప్రైవేట్ ఉద్యోగం చేసే వ్యక్తి ఇంటిలో చోరీ జరిగింది. వారు తాళంవేసి సెకెండ్‌షో సినిమాకువెళ్లారు. వారు వచ్చేసరికి ఇంటిలో ఉన్న నగదు, నగలు ఎత్తుకెళ్లారు. రెండు నెలల క్రితం ముద్దిరెడ్డిపల్లి శివారు ప్రాంతంలో ఓ ఇంటివారు శుభకార్యానికి వెళ్లారు. మూడు రోజుల తరువాత వచ్చి చూస్తే నగలు, పట్టు చీరలు ఎత్తుకెళ్లారు. నాలుగు రోజుల క్రితం దండు రోడ్డులో ఓ న్యాయవాది ఇంట్లో గ్రౌండ్‌ఫ్లోర్‌లో గదికి తాళాలు పగలకొట్టి ఇంట్లో జొరబడ్డారు. ఆ గదిలో అన్ని పుస్తకాలే ఉండటంతో వెళ్లిపోయారు. తాజాగా ఐదు రోజుల క్రితం చిన్నమార్కెట్ ప్రాంతంలో స్కూటీలో పెట్టిన రూ.5లక్షల నగదు దొంగలు ఎత్తుకెళ్లారు. లేపాక్షి మండలకేంద్రంలో ఓ ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో ఎవరూ లేకపోవడంచూసి తాళాలు పగలకొట్టి నగలు ఎత్తుకెళ్లారు. ఇవి పోలీసులకు, బయట ప్రపంచానికి తెలిసినవి. కానీ తెలియనివి ఎన్ని ఉన్నాయో అర్థం కాని పరిస్థితి.

సవాల్ విసురుతున్న దొంగలు

వరుస చోరీలతో పాటు బ్యాంకుల వద్ద నగదు కొట్టేయడం, ఏటీఎం కార్డులు మోసం చేయడం, ద్విచక్రవాహనాలు ఎత్తుకెళ్లడం, పరిగి, ఆర్టీసీ బస్టాండులో చైన్‌స్నాచింగ్, పిట్‌ప్యాకింగ్‌లు చెప్పనవసరం లేదు.

రాత్రిపూట తగ్గిన గస్తీ

వైసీపీ పాలనలో పోలీస్ స్టేషన్‌లో పనిచేసే సిబ్బంది వారి సొంత విధులు పక్కనబెట్టి వైసీపీ నాయకుల సేవకే అధిక సమయం కేటాయించారు. దీనివల్ల రాత్రిపూట గస్తీ చాలావరకు తగ్గిందన్న అపవాదను మూటగట్టుకున్నారు. దీనికితోడు హిందూపురం పట్టణంలో గత తెలుగుదేశం హయాంలో పెనుకొండలో డీఎస్పీ ఉన్నాకానీ రాత్రిపూట ఇక్కడ సిబ్బందికి తెలియకుండా కనీసం సీఐకి చెప్పకుండా గస్తీని పర్యవేక్షించేవారు. ఆ ప్రాంతాల్లో రాత్రిపూట డీఎస్పీ ఆకస్మిక తనిఖీ చేసేవారు. అయితే ఇదంతా పాత కథగా మారిపోయియంది. చోరీలు జరిగినప్పుడు ఉన్నతాధికారులు ప్రశ్నిస్తే సిబ్బంది కొరత ఉన్నట్లు తప్పించుకుంటున్నట్లు సమాచారం.

రికవరీలు ఏవీ..?

హిందూపురంలో జరుగుతున్న చోరీల విషయంపక్కనబెడితే ఐదేళ్ల క్రితం జరిగిన చోరీలు సైతం రికవరీ చేయకపోవడం గమనార్హం. ఇటీవల కాలంలో రికవరీ అన్నమాట పోలీసులు మరిచిపోయారని చెప్పవచ్చు. చోరీలు రుగుతూనే ఉన్నాయి. ప్రతినెలలో కనీసం నాలుగ నుంచి ఐదు చోరీలుంటాయి. ఆరునెలలైనా ఒక్క రికవరీ జరిగినట్లు పోలీసులు తెలపకపోవడమే ఇందుకు సాక్షంగా చెప్పవచ్చు.

లర్నింగ్ బీట్ వేస్తాం: కంజక్షన్, డీఎస్పీ,

హిందూపురంలో రాత్రిపూట చోరీలు అరికట్టేందుకు సాధారణ బీట్‌తోపాటు లర్నింగ్‌బీట్ కూడా ఏర్పాటు చేస్తాం. అనుమానిత వ్యక్తులను, ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారిని గుర్తించి అనుమానం కలిగితే గుర్తింపు కార్డు తనిఖీ చేస్తాం. ఇళ్లకు తాళాలువేసి బంధువుల ఇంటికి వె ళ్లేవారు నగలు, నగదు బ్యాంక్ లాకరులో పెట్టి వెళ్లాలి. లేదా పోలీసులకు సమాచారం ఇస్తే అలాంటి ఇళ్లవద్ద గస్తీ నిర్వహిస్తాం.

వ్యవస్థల పునర్నిర్మాణమే టీడీపీ లక్ష్యం: ఎమ్మెల్యే

మడకశిరటౌన్, జూలై 12: వైసీపీ ప్రభుత్వం హయాంలో అన్ని వ్యవస్థలను ధ్వంసం చేశారని, వాటిని పునర్నిర్మించి పాలనను గాడిలో పెట్టడానికి సీఎం చంద్రబాబునాయుడు అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. శుక్రవారం మడకశిర పట్టణంలో పర్యటించిన ఆయన అన్నా క్యాంటీన్ల ఏర్పాటు, డివైడర్ల నిర్మాణం తదితర వాటిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో పేదల ఆకలితీర్చే అన్నా క్యాంటీన్ లాంటి వాటిపై కూడా జగన్ కక్షకట్టి మూయించడం దుర్మార్గం అన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి,వక్కలిగ సాధికార కన్వీనర్ వి.ఎం.పాండురంగప్ప, కౌన్సిలర్ నరసింహరాజు, పట్టణ అధ్యక్షులు మనోహర్, రవి, తిమ్మరాజు, అక్కంపల్లిబాబు, బీజేపీ, జనసేన నాయకులు ఉన్నారు.



అన్న క్యాంటీన్ ప్రారంభంపై చర్చిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

గుడిబండ: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. వడ్డెరహట్టి, ఫళారం గ్రామాల్లో తెగిపోతున్న కల్వర్టును పరిశీలించారు. కరేకెర సమీపంలోని కేజీబీవీ పాఠశాలను పరిశీలించారు. ఫళారం గ్రామంలో వైసీపీ నాయకుడు ఈరలక్కప్పను కలిశారు. మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, రొళ్ల కన్వీనర్ దాసిరెడ్డి, మంజునాథ్ పాల్గొన్నారు.



ఈరలక్కప్పతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

పురంలో కలెక్టర్ తనిఖీలు



కోర్టు నిర్మాణానికి భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్

హిందూపురం, జూలై 12: కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారిగా హిందూపురం వచ్చిన జిల్లా కలెక్టర్ చేతన్ శుక్రవారం తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నూతన తహసీల్దార్ కార్యాలయ భవనం అప్పగించడంపై చర్చించారు. ఈ సందర్భంగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్ బాలాజీ తనకు ఇంకా రూ.58లక్షల బిల్లులు రావాలనీ, అయినా ఎన్నికల సమయం నుంచి వాడుకలోకి తీసుకొచ్చినా బిల్లులు మంజూరు చేయలేదన్నారు. త్వరలోనే బిల్లుల మంజూరుకు ప్రయత్నిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం అక్కడి నుంచి శిధిలావస్థకు చేరుకున్న స్పెషల్ కోర్టు భవనాన్ని పరిశీలించారు. న్యాయవాదుల సంఘం రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి విన్నపం మేరకు నూతన భవనం నిర్మించేవరకు పాత తహసీల్దార్ కార్యాలయానికి స్పెషల్ కోర్టుకు వినియోగించుకోవాలని సూచించారు. అక్కడి నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని వైద్యుల సేవలపై ఆరాతీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 25వేల మంది పింఛన్‌దారులకు ఈనెల మొదటి రోజునే 90శాతానికిపైగా పింఛన్లు అందజేస్తామన్నారు. ఆసుపత్రి ఆవరణంలో ఏర్పాటవుతున్న అన్నా క్యాంటిన్ భవనాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ అపూర్వభరత్, టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, డీఎస్పీ కంజక్షన్, సీఐ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీ పరిశీలన

చిలమత్తూరు: మంచి విద్యాబోధనలతో విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయనతో పాటు పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ కలిసి స్థానిక కేజీబీవీ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతన్ పదోతరగతిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్యాంశాలపై సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. సబ్‌కలెక్టర్ భరత్ భోజనాన్ని పరిశీలించారు. ఆక్కడే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తహసీల్దార్ భాగ్యలత, ఎంఈఓ సల్మాన్‌రాజ్ తదితరలు ఉన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు

- ప్రమాదం జరిగితే తల్లిదండ్రులదే బాధ్యత
- జూనియర్ సివిల్ న్యాయాధికారి రాజ్యలక్ష్మి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి రాజ్యలక్ష్మి

హిందూపురం, జూలై 12 : మైనర్లకు ద్విచక్రవాహనాలుకానీ, కార్లుకానీ ఇచ్చి పంపినప్పుడు ప్రమాదాలు జరిగితే తల్లిదండ్రులే పూర్తీ బాధ్యత వహించాల్సి ఉంటుందని జూనియర్ సివిల్ న్యాయాధికారి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌వద్ద జరిగిన జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో న్యాయాధికారి మాట్లాడుతూ.. డ్రైవింగ్ చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయడం తప్పన్నారు. కార్లలో ప్రయాణించేటప్పుడు సీటుబెల్టు, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు లోక్‌అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు జగన్నాథ రథయాత్ర

అనంతపురం కల్చరల్, జూలై 12: నగరంలో శనివారం నిర్వహించే పూరీ జగన్నాథ రథయాత్రకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇస్కాన్ అనంతపురం శాఖ ఆధ్వర్యంలో గవర్నింగ్ బాడీ కమిటీ చైర్మెన్ రేవతీ రమణదాస్ ప్రభు ఈ రథయాత్రను ప్రారంభిస్తారు. రథయాత్రను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం నగర శివారులోని ఇస్కాన్ మందిరం వద్ద సందడి నెలకొంది. తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాల కళాకారుల ప్రదర్శనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు జగన్నాథుడి రథయాత్ర ప్రారంభమవుతుంది. కేఎస్ఆర్ కళాశాల నుంచి రథయాత్ర ప్రారంభమై.. సుభాష్ రోడ్డు, క్లాక్‌టవర్, రాజురోడ్డు మీదుగా సాగుతుంది.

అధ్వాన రోడ్లలో ప్రయాణం నరకం


పెనుకొండ రూరల్, జూలై 12 : అధ్వాన రహదారుల్లో ప్రయాణం వాహనదారులకు నరకప్రాయంగా మారింది. పెనుకొండ నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారిలో తేలికపాటి వర్షానికే రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. పెనుకొండ-నారాయణమ్మకాలనీ మీదుగా కోనాపురం, మంగాపురం మీదుగా వెళ్లే రహదారి తేలికపాటి వర్షానికే గుంతలుపడ్డ రోడ్లలో ప్రయాణం నరకమని వాహనదారులు వాపోతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా మరమ్మతులు చేపట్టలేదన్నారు. పెనుకొండ మంగాపురం, కోనాపురం వెళ్లే దారిలో దాదాపు 50 గుంతలున్నాయి. పలు సందర్భాల్లో ఆటో, ద్విచక్రవాహనాలు అదుపుతప్పి బోల్తా పడ్డ సంఘటనలు ఉన్నాయి. గత ఐదేళ్లుగా వైసీపీ హయాంలో పాలకులు పెనుకొండ నుంచి కోనాపురం వెళ్లే రహదారి రూ 2కోట్లతో సీసీరోడ్లు ప్రారంభమైందని కల్లిబొల్లి మాటలు చెబుతూ కాలయాపన చేసి ఎన్నికల్లో కనుమరుగయ్యారన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



మంగాపురం రోడ్డులో నిలిచిన వర్షపునీరు

పావగడకు తరలివచ్చిన తుంగభద్ర

పావగడ, జూలై 12 : తుంగభద్ర పావగడకు తరలివచ్చింది. ఈ రోజును ఎప్పటికీ మరిచిపోలేనని పావగడ ఎమ్మెల్యే వెంకటేశ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పావగడ తాలూకా పరిధిలోని కెంచమరహళ్లి గేటులో ఐపీఎస్3 ఫిల్టర్‌కు తుంగభద్ర తాగునీరు తరలిరావడంతో ఎమ్మెల్యే గంగపూజ చేసి ప్రారంభించారు. ఎంతో మంది రైతులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, దళిత సంఘాలు నెలల కొద్ది నిరాహారదీక్షలు, పోరాటాల ఫలితంగా నేడు తుంగభద్రకు నీరు సాధ్యమయ్యిందన్నారు. 2013లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య తుంగభద్ర తాగునీటి కోసం 250 కి.మి. దూరం వరకు 1,116 గ్రామాలకు తాగునీటి సౌకర్యం అందించాలన్న ఉద్దేశంతోనే కాల్వ పనులు చేపట్టారన్నారు. పది సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న తాగునీరు పావగడకు తరలిరావడంతో ఈ ప్రాంత ప్రజల ఆనందానికి హద్దు లేకుండా పోయిందన్నారు. అధికారులకు, ఇంజనీర్లకు రుణపడి ఉంటామని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తాగునీటి శాఖాధికారి హనుమంతరాయప్ప, జేఈ బసవలింగప్ప, కాంగ్రెస్ నాయకులు నాని, కౌన్సిలర్లు రవి, రాజేష్, రిజ్వాన్, షాబాబు, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాలువలో పారుతున్న నీరు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

కర్ణాటక మద్యం పట్టివేత

హిందూపురం, జూలై 12 : కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం పోచనపల్లి, పెన్నా నది సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టణానికి చెందిన ఖలీల్ అనే వ్యక్తి స్కూటీపై 12బాక్సుల మద్యం తెస్తూ పట్టుబడ్డాడన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి మద్యం, వాహనాన్ని సీజ్ చేశామన్నారు. దీనివిలువ సుమారు రూ.50వేలు ఉంటుందని సెబ్‌సీఐ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. ఎస్ఐ కమలాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం బాక్సులను చూపుతున్న సెబ్ పోలీసులు

కేబుల్ చోరీ



బోరు బావి వద్ద మాయమైన కేబుల్

మడకశిర రూరల్, జూలై 12: మండలంలోని ఆమిదాలగొంది గ్రామ సమీపంలో చెరువులో వేసిన రెండు తాగునీటి బోర్ల కేబుల్ వైర్లు గుర్తుతెలియని వ్యక్తులు తీసుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. శుక్రవారం ఉదయం చెరువులో ఉన్న తాగునీటి బోర్లు వైర్ల గుర్తుతెలియని ముగ్గురు యువకులు కట్ చేసుకుని తీసుకెళ్తుండగా గమనించిన గ్రామస్థులు వారిని వెంబడించారు. అందులో ఒక వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పజెప్పారు. మిగిలిన ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారు. దర్యాప్తుచేసి మిగిలిన వారిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో ఘర్షణ... ఒకరికి గాయాలు

నార్పల, జూలై 12: మండలంలోని గూగూడు గ్రామంలో ఇద్దరు వ్యక్తులు అతిగా మద్యం సేవించి శుక్రవారం డబ్బు విషయమై ఘర్షణ పడ్డారు. ఘర్షణలో ఒకరు గాయపడ్డారు. గోరంట్లకు చెందిన లక్ష్మీకాంత్, నాగరాజు అనే ఇద్దరు స్నేహితులు గూగూడు కుళ్లాయిస్వామి దర్శనానికి వచ్చారు. స్వామి దర్శనం అనంతరం బ్రాందిషాపులో అతిగా మద్యం సేవించి డబ్బు విషయమై ఒకరికొకరు దుర్భషలాడుకున్నారు. కోపోద్రికుడైన లక్ష్మీకాంత్ చేతిలో ఉన్న బీర్ సిసాతో నాగరాజు తలపై విచక్షణారహితంగా కొట్టాడు. ఘర్షణలో నాగరాజు తీవ్రంగా గాయపడగా స్థానికులు ఆయనను 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లక్ష్మీకాంత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

వేలం వాయిదా

గోరంట్ల, జూలై 12: పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వారపుసంత కూరగాయాల వేలాన్ని అధికారులు శుక్రవారం వాయిదా వేశారు. డీపీఓ విజయ్‌కుమార్‌రెడ్డి, ఈఓఆర్‌డీ సుధాకర్ ఆధ్వర్యంలో కార్యదర్శి బాబురావు వేలం పాటను నిర్వహించారు. వారపు కూరగాయాల సంత గత యేడాది వేలం రూ.33లక్షల 60 వేలు పలికింది. వేలంలో 14మంది పాల్గొన్నప్పటికి ప్రభుత్వ నిర్ణీత ధరకుమించి పాడకపోవడంతో డీపీఓ వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. బస్టాండ్ స్టాండ్ ఫీజు గత యేడాది రూ.5,50,500 పోగా ఈయేడాది వేలం రూ.మూడులక్షల 95వేలకు నిర్ణయించారు. సంత మార్కెట్‌లోని గదులకు ఎవరూ డిపాజిట్ కట్టకపోవడంతో వాటి వేలాలు నిర్వహించలేదు. జేఆర్‌పై ఏడు గదులకు వేలం వేశారు. త్వరలో వేలం తేదీని ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

బీసీ మహిళలకు ప్రత్యేక పథకాలు తీసుకురండి

పెనుకొండ టౌన్, జూలై 12 : రాష్ట్రంలోని బీసీ మహిళలను ఆర్థికాభివృద్ధి చెందేవిధంగా పథకాలు తీసుకురావాలని మహిళా మోర్చా అనంతపురం జిల్లా వైస్ ప్రెసిడెంట్, బీసీ మహిళ అధ్యక్షురాలు ప్రత్యూష పేర్కొన్నారు. శుక్రవారం బీసీ సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖ మంత్రి సవితను కలిసి, సన్మానించారు. అనంతరం పలు సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందజేశారు.

చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి

గోరంట్ల, జూలై 12: చిలమత్తూరు మండలం భూమయ్యగారిపల్లికి చెందిన డ్రైవర్ వడ్డె ఆంజనేయులు కాలిన గాయాలతో బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. భూమయ్యగారిపల్లికి చెందిన వడ్డె ఆంజనేయులు 11 సంవత్సరాల క్రితం గోరంట్ల మండలంలోని గుమయ్యగారిపల్లికి చెందిన రాధమ్మతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులున్నారు. ఆంజనేయుడుతో గొడవపడిన భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. భార్య ఇంటికి రావడానికి ససేమిరా అనడంతో మనస్థానికి గురైన ఆంజేయుటు ఈ నెల 8న పెట్రోల్ శరీరంపై పోసుకుని అంటించుకున్నారు. బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గురుపూజోత్సవాన్ని విజయవంతం చేయండి

రొళ్ల, జూలై 12: మండల కేంద్రంలో వెలిసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద శనివారం నిర్వహించే గురుపూజోత్సవాన్ని విజయవంతం చేయాలని మండల స్వయం సేవక్ ఎం.ముద్దరాజు కోరారు. ఈకార్యక్రమానికి ప్రధానకర్త అశోక్‌జీ ముఖ్య అతిథిగా హాజరవుతారని మండల హిందూ, స్వయం సేవక్, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఓ శేఖర్‌నాయక్

అగళి, జూలై 12 : వ్యవసాయ పనిముట్ల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని ఇనగలూరు, మధూడి గ్రామాల్లో శుక్రవారం వ్యవసాయశాఖ ఏఓ శేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో వ్యవసాయ పనిముట్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టం షేరింగ్ సెంటర్‌ను పరిశీలించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఈఓ దాక్షాయిని, రైతులు పాల్గొన్నారు.

ఎంజేపీ పాఠశాల తనిఖీ

మడకశిరటౌన్, జూలై 12: పట్టణంలోని ఎంజేపీ జూనియర్ కళాశాలను జిల్లా స్పెషల్ ఆఫీసర్ కృష్ణానాయక్ శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. మెనూ, ఆహార నాణ్యతను వంటగదిలోకి వెళ్లి పరిశీలించారు. ఈసందర్భంగా ఎంఈఓ శ్రీనివాసభాస్కర్, తదితరులు ఉన్నారు.



భోజనాలను పరిశీలిస్తున్న అధికారులు

బాలికల హాస్టల్ తనిఖీ

గోరంట్ల, జూలై 12: పట్టణంలోని గిరిజనబాలికల గురుకుల పాఠశాలను స్పెషలాఫీసర్, డీపీఓ విజయ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. హాస్టల్‌లో 212మంది విద్యార్థినులకు గాను 188మంది హాజరైయ్యారు. వసతి గృహంలో శానిటేషన్, తాగునీరు తదితర వసతులపై ఆరాతీశారు. భోజనం పరిశీలించి, స్టోర్ గదిని, స్టాక్ రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. గత యేడాది 10లో 96శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తెలిపారు. పాత భవనంలో పాఠశాల నిర్వహిస్తుండడంతో బాలికలు ఇబ్బంది పడుతున్నట్లు అదికారులు గుర్తించారు. సోషల్ టీచర్ లేరని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ జాన్‌రెడ్డెప్ప, ఈఓఆర్‌డీ సుధాకర్ ఉన్నారు.



మినరల్ వాటర్ ప్లాంటును పరిశీలిస్తున్న అధికారులు